క్లుప్తంగా

ఆల్ ఇండియా కాన్ఫరెన్స్‌ను విజయవంతం చేయండి



గురజాల: భారతీయ జీవిత బీమా సంస్థ నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇన్సూరెన్స్ వర్కర్స్ 19వ ఆల్ ఇండియా కాన్ఫరెన్స్ కార్యక్రమం రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీర్ ప్రాంతంలో ఫిబ్రవరి 9, 10 తేదీలలో జరగనుందని భారతీయ జీవిత బీమా సంస్థ దక్షిణ మండల నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇన్సూరెన్స్ వర్కర్స్ కౌన్సిల్ మెంబర్ అద్దంకి సాంబశివరావు సోమవారం తెలిపారు. భారతీయ జీవిత బీమా సంస్థ గురజాల బ్రాంచ్‌లో ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం ఇన్సూరెన్స్ వర్కర్స్ డివిజనల్ ఉపాధ్యక్షుడు ఎ.నరసింహారావు, ఏజెంట్స్ అసోసియేషన్ ప్రతినిధి జక్కా కోటేశ్వరరావుతోపాటు పలువురు పాల్గొన్నారు.

ప్రజలకు కనీస వసతులు ఏర్పాటు చేయాలి

కన్నెగంటి ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు



రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి 175వ వజ్రోత్సవ తిరునాళ్ల సందర్భంగా మంగళవారం నుంచి నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు ఎద్దుల బల ప్రదర్శనకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల నుంచి తరలివచ్చే వీక్షకులకు కనీస వసతులు ఏర్పాటు చేయాలని కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షుడు నారాయణం శ్రీనివాసరావు కోరారు. సోమవారం ఆయన మండల బీజేపీ అధ్యక్షుడు బోయ నాగిరెడ్డితో కలిసి ఎంపీడీఓ కె.సరోజినిదేవి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ పిన్నం బ్రహ్మయ్య, గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి జి.అనంత కోటేశ్వరరావులకు వినతి పత్రాలను అందజేసి మాట్లాడారు. మాచర్ల–గుంటూరు ప్రధాన రహదారి వెంబడి సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల మైదానంలో జరగనున్న ఎద్దుల బల ప్రదర్శనకు వేల సంఖ్యలో ప్రజలు తరలివస్తారని, వారందరికీ మొబైల్ టాయిలెట్స్ (తాత్కాలిక మరుగుదొడ్లు) ఏర్పాటు చేయాలని కోరారు. బహిరంగ ప్రదేశాలలో మల మూత్ర విసర్జన చేయడం వలన అనేక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు.

పారదర్శకంగా భూముల రీ సర్వే

కారెంపూడి: రీ సర్వేకు రైతులు సహకరించి శాశ్వతంగా భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ కోరారు. మండలంలోని చినకొదమగుండ్ల గ్రామంలో సోమవారం రీ సర్వేపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రస్తుతం గ్రామాల బౌండరీలను గుర్తించే సర్వే జరుగుతోందన్నారు. ఇది పూర్తికాగానే పట్టా భూముల రీ సర్వే జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు. దశారీ వ్యవస్థకు స్వస్తి పలుకుతూ పారదర్శకంగా రీ సర్వే చేసి రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతుల మధ్య ఉన్న గట్టు తగాదాలు భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతాయని అన్నారు. భూమి ఒక చోట అనుభవం వేరే చోట ఉన్న రైతుల సమస్యలు కూడా పరిష్కారం అవుతాయని వివరించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



దాచేపల్లి: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్సై సౌందర్యరాజన్ తెలిపారు. గామాలపాడు సాగర్ సిమెంట్ కార్మికులు రోడ్డు భద్రతా మాసోత్సవాలు సందర్భంగా సోమవారం నారాయణపురం ఆర్ అండ్ బీ బంగ్లా నుంచి స్థానిక అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎస్సై సౌందర్యరాజన్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అతివేగంతో వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడవద్దని సూచించారు. కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్లాంట్ హెడ్ సుబ్బారావు, కార్మికులు సంజయ్‌కుమార్, కృష్ణ, వేణు, చంద్రనారాయణరెడ్డి, గణేష్, నరసింహులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ పర్యటన

మాచర్ల: మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు సోమవారం పట్టణంలోని పలు వార్డులలో తిరిగి పరిశీలించారు. పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో జెడ్పీహెచ్ బాలురోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మధ్యాహ్న భోజనాన్ని అందించాలని సూచించారు. సుద్దగుంతల ప్రాంతంలోని సచివాలయంలో ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆధార్ కేంద్ర పనితీరును అడిగి తెలుసుకున్నారు.

నగరవనం.. నయనానందకరం

▸▸ నగర ప్రజలకు ఆహ్లాదాన్నిచ్చే ప్రాంతం ▸▸ పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10 ఎంట్రీ ఫీజు



ఆటలాడుతున్న పాఠశాల విద్యార్థులు

మాచర్ల రూరల్: పెరుగుతున్న జనాభా, ఉద్యోగ, వ్యాపార ఉపాధి రంగాలలో బిజీ బిజీగా గడుపుతూ ఒత్తిడికి గురవుతున్న ప్రజానీకానికి ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని, పచ్చదనాన్ని అందించేందుకు అటవీ శాఖాధికారులు ప్రకృతిలో సేదతీరేలా నగర వనాన్ని తీర్చిదిద్దారు. గత ఏడాది అప్పటి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చొరవతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ నిధులతో పట్టణ శివారులోని శ్రీశైలం రహదారి మార్గంలో రూ.1.04 కోట్ల వ్యయంతో 50 హెక్టార్లలో నగర వనం నిర్మాణాన్ని చేపట్టారు. ప్రస్తుతం అది సకల హంగులతో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుని పలువురికి ఆహ్లాదాన్ని అందిస్తుంది.

● ఈ నగర వనంలో ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు పర్యావరణ పరిరక్షణ, అడవుల విస్తీర్ణం, వినోదం కల్పించటంతో పాటు చిన్నారులకు చిల్డ్రన్ పార్కు, ఆడుకోవటానికి ఉయ్యాల, జారుడు బల్ల, అడ్వంచర్ ట్రెక్కింగ్ పార్కు, ఓపెన్ జిమ్‌లు ఉన్నాయి. పెద్దలకు, యువకులకు 3 కి.మీ.ల విస్తీర్ణంలో వాకింగ్ ట్రాక్, అలాగే ప్రశాంతంగా ధ్యానం చేసుకునేందుకు ధ్యాన మందిరం ఏర్పాటు చేశారు. చిన్న చిన్న బర్త్‌డే వంటి ఫంక్షన్‌లు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేసుకునేందుకు సౌకర్యాలు కల్పించారు. క్యాంటీన్, సోఫాలుగా ఉండే కుర్చీలు, వాష్ రూములు ఉన్నాయి.

విద్యార్థులకు ప్రత్యేక రాయితీ



అడ్వెంచర్ ట్రెక్కింగ్ పై బాలలు

పండుగలు, వేసవి, వారాంతపు సెలవుల్లో పిల్లలు టీవీలకు, సెల్‌ఫోన్‌లకు అతుక్కుపోయి సమయాన్ని వృథా చేస్తూ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటూ మానసిక ఒత్తిడికి గురికాకుండా కుటుంబ సభ్యులందరూ ప్రకృతిలో సేదతీరేలా నగర వనం పూర్తి అటవి దుపు కేంద్రంగా ఉంది. ఆహ్లాదకరమైన వాతావరణం, రమణీయమైన ప్రకృతి, కొండ కోనల మధ్యలో ఏర్పాటు చేసిన నగరవనం నయనానందకరంగా పలువురుని ఎంతాగానో ఆకట్టుకుంటుంది. అటవి శాఖ నేతృత్వంలో నిర్వహించే ఈ వనంలో ఎంట్రీ ఫీజు పెద్దలకు రూ.20, చిన్నారులకు రూ.10, పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక రాయితీ కల్పిస్తున్నామని, రక్షణ కొరకు వాచ్‌మెన్, తోటమాలి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ విజయలక్ష్మి తెలిపారు.

విద్యార్థులకు ఉపయోగకరం



విద్యార్థులకు ఈ నగరవనం ఎంతో ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని అందిస్తుంది. స్పోర్ట్స్ కార్యక్రమాన్ని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవచ్చు. పర్యావరణ పరిరక్షణ, అడవుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఎంతగానో దోహదపడుతుంది.

– శ్రీలక్ష్మి, ఓక్ బ్రిడ్జి స్కూల్, వైస్ ప్రిన్సిపాల్

మానసిక ఉల్లాసాన్నిచ్చే ప్రాంతం



పట్టణ ప్రజలకు, విద్యార్థులకు నగరవనం ఎంతో ఉపయోగకరం. ఆహ్లాదకర వాతావరణంలో రమణీయమైన ప్రకృతి మధ్య నిర్మించటం చాలా బాగుంది. సరైన పార్కులు, ఆట స్థలాలు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలను ఇది ఎంతగానో ఆకట్టుకుంటుంది. విద్యార్థులకు మానసికంగా ఉల్లాసాన్నిచ్చే ప్రాంతం.

– కె.వి.రమణ, ప్రైవేటు కాన్వెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు



జంప్ చేస్తున్న బాలికలు



క్యాంటీన్‌లో విద్యార్థులు



ఉయ్యాల ఊగుతున్న విద్యార్థులు

పెండింగ్ పనులను పూర్తి చేయండి

విద్యుత్ ఎస్ఈ డాక్టర్ పి.విజయ్‌కుమార్



పిడుగురాళ్ల: విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సమస్యలు తగ్గించేందుకు పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తి చేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ పి.విజయ్‌కుమార్ అన్నారు. పట్టణ సమీపంలోని కొండమోడులో ఉన్న విద్యుత్ శాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించి అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు న్యాణమైన విద్యుత్‌ను అందించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించే విధంగా సిబ్బంది విధులు నిర్వహించాలని సూచించారు. విద్యుత్ బకాయిలు లేకుండా చర్యలు తీసుకోవాలని, మొండి బకాయిలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. అలాగే పిడుగురాళ్ల పట్టణంలో మంగళవారం రథోత్సవాన్ని పురస్కరించుకొని మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 7 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సురేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్య సహాయమాత మందిరంలో నవదిన ప్రార్థనలు

రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి 175వ వజ్రోత్సవ తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా సోమవారం స్థానిక బాలవికాస్ హైస్కూల్ వద్దనున్న నిత్య సహాయమాత మందిరం వద్ద నవదిన ప్రార్థనలు నిర్వహించారు. పేరేచర్ల విచారణ గురువులు రెవ.ఫాదర్ గంజి బాలస్వామిరెడ్డి భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. దేవునిచే ఎన్నుకోబడిన మరియతల్లిని ప్రతి ఒక్కరూ ప్రార్థించాలన్నారు. మరియతల్లి విశిష్టతను వివరించారు. కథోలికులందరూ ప్రతి రోజు మరియతల్లిని ప్రార్థిస్తూ జపమాలను చెప్పుకోవాలని కరుణమయురాలు అయిన ఆ తల్లి ఆశీస్సులు తప్పకుండా పొందుతారన్నారు. ఈ దివ్యపూజాబలిలో ఫాదర్లు అగస్టిన్, చర్చి పెద్దలు, కన్యాస్త్రీలు, భక్తులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు సత్కారం



ఉత్తమ కమిషనర్‌గా శ్రీధర్



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న 104 డ్రైవర్ నారాయణ



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఏఈ పాశం శ్రీనివాసరెడ్డి

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ఉత్తమ అధికారులుగా ఎంపికైన వారికి గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జేసీ గన్నోరే, ఎస్పీ శ్రీనివాసరావు తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు అవార్డులను ప్రదానం చేశారు. గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లో ప్రశంసా పత్రాలు అందుకున్న అధికారులను, ఉద్యోగులను ఆయా శాఖల సిబ్బంది సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. – గురజాల, మాచర్ల



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న టైపిస్టు దేవండ్ల విజయ్ కుమార్



అవార్డు స్వీకరిస్తున్న సీఐ శ్రీనివాసరావు



అవార్డు స్వీకరిస్తున్న ఈఓ హనుమంతరావు



అవార్డు అందుకుంటున్న ఎంపీడీవో సరోజినిదేవి



అవార్డు అందుకుంటున్న వీఆర్ఓ భాస్కర్



అవార్డు అందుకుంటున్న టైపిస్టు నాగవల్లి



అవార్డు అందుకుంటున్నఅటెండర్ సోమ్లానాయక్



అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ వేణుబాబు



ఉత్తమ సేవా పురస్కారం అందుకుంటున్న డీఈ మురళీధర్



సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావును సన్మానిస్తున్న తహసీల్దార్, ఉద్యోగులు

కొనసాగుతున్న ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల మహోత్సవం

నేడు సీతరాముల కల్యాణం, రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

పిడుగురాళ్ల: పట్టణంలో వేంచేసియున్న ప్రసన్నాంజనేయస్వామి 18వ వార్షికోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభించారు. ఆరాధన, సేవాకాలం, మంగళా శాసనం, వేద విన్నపాలు, పూలమంత్ర, మూర్తిమంత్ర హవనాలు, మన్య సూక్త హవనం, పూర్ణహుతి, తీర్థ ప్రసాద వినియోగం వంటివి నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకొని దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సెట్టింగులతో ప్రత్యేక ముఖ ద్వారాన్ని ఏర్పాటు చేశారు.



ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ముఖ ద్వారం, విద్యుత్ కాంతులలో దేవాలయం

నేడు కల్యాణం, రథోత్సవం

పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమీపంలో ఉన్న ప్రసన్నాంజనేయస్వామివారి దేవాలయం వద్ద మంగళవారం సీతారాముల కల్యాణం, అనంతరం మహా అన్నదానం, అనంతరం స్వామి వారి రథోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథి శ్రీ కోటిలింగ మహా దైవక్షేత్ర పీఠాధిపతి, ధర్మదేవత గురుతులైన శివ స్వామి హాజరు కానున్నారు.

కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు



కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ జి.పుష్పలత, టీడీపీ నాయకుడు పంగులూరి పుల్లయ్య తదితరులు సోమవారం పర్యవేక్షించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాలతో గ్రామంలో బజార్లు బాగాలేని చోట సీసీ రోడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టామని పంగులూరి పుల్లయ్య తెలిపారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లి గ్రామ ప్రధాన రహదారిని కూడా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని పుల్లయ్య పేర్కొన్నారు.

బాధ్యతగా పనిచేయండి.. పథకాలు దరిచేర్చండి



కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్సులో పురపాలక సంఘ అధికారులు

మాచర్ల: రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేయటంలో పురపాలక సంఘ, మెప్మా, అంగన్‌వాడీ, హౌసింగ్ అధికారులు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. సోమవారం మధ్యాహ్నం ఆయన పలు శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. ప్రభుత్వం త్వరలో ఇళ్ల స్థలాల మంజూరుతో పాటు శరవేగంగా ఇళ్లు నిర్మించుకునే వారికి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటుందన్నారు. మెప్మా ప్రాజెక్టు ద్వారా పేద, మధ్య తరగతి వారికి జీవనోపాధి కల్పిస్తుందన్నారు. అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఈ కాన్ఫరెన్సులో మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు, మెప్మా ప్రాజెక్టు స్థానిక అధికారి రాజశేఖర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తదితరులున్నారు.

రెంటచింతలలో తప్పిన పెను ప్రమాదం



రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో సోమవారం పెను ప్రమాదం తప్పింది. రెంటాల నుంచి మినీ లారీలో వరిగడ్డి తీసుకువస్తుండగా స్థానిక బ్రహ్మయ్య బావి సెంటర్ వద్ద విద్యుత్ తీగ తెగి వరిగడ్డిపై పడటంతో మంటలు అంటుకున్నాయి. గమనించిన లారీ డ్రైవర్ చాకచక్యంగా ఆ లారీని ప్రధాన రహదారి వెంబడి జనసంచారం లేని సీపీఐ కార్యాలయం వద్ద ఆపి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చాడు. వెంటనే స్థానికులు స్పందించి మంటలను ఆర్పడానికి ప్రయత్నించారు. అగ్నిమాపక వాహనం అక్కడకు చేరుకోవడంతో సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదం వలన సుమారు రూ. 1.50 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

రైలు కింద పడి యువకుడి మృతి



మాచర్ల రూరల్: కంభంపాడు గ్రామ పరిధిలో మాచర్ల నుంచి గుంటూరు వెళ్తున్న ప్యాసింజర్ రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. రూరల్ పోలీసుల వివరాల ప్రకారం పట్టణంలోని 17వ వార్డు శ్రీనివాస మహల్ వెనుక భాగంలో నివాసమంటున్న వడ్లమాను నవీన్ (28) తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లిపోయి కంభంపాడు గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న రైలు కింద పడి మృతిచెందాడు. ఈ మేరకు రైల్వే పోలీసులకు సమాచారమివ్వగా వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ఫిబ్రవరి 2న భగవాన్ గీతా యజ్ఞం

పరబ్రహ్మ కాశీవిశ్వనాథ స్వామి

మాచర్ల: నియోజకవర్గ కేంద్రమైన మాచర్ల పట్టణంలో ఫిబ్రవరి 2న సర్వజీవ శ్రేయస్సు, సర్వలోక శాంతి కొరకు కోటి నామోత్సవం, గీతా యజ్ఞం నిర్వహించనున్నట్లు పరబ్రహ్మ కాశీవిశ్వనాథ స్వామి తెలిపారు. శ్రీశైలం రోడ్డులోని ఆశ్రమంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. అందులో భాగంగా ఇప్పటికే నియోజకవర్గంలోని మండలాల్లో సత్సంగములు నిర్వహిస్తూ భక్తి యోగ కార్యక్రమ పారాయణం జరుగుతుందన్నారు. గుంటూరు రోడ్డులోని చెన్నకేశవ కాలనీ ఎదురు ఫిబ్రవరి 2వ తేదీ ఆదివారం లక్ష మందితో భగవాన్ గీతా యజ్ఞం, భక్తి యోగ పారాయణంలో భాగంగా కోటి నామోత్సవం నిర్వహిస్తామన్నారు. పారాయణ కార్యక్రమాన్ని జయప్రదం చేయటానికి పలు గ్రామాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 2న ఓంకారం, సుప్రభాతం, అభిషేకాలు, యజ్ఞం, కోటి నామోత్సవ కార్యక్రమం జరుపుతామన్నారు. ప్రజలు కోటి మహోత్సవానికి తరలివచ్చి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

600 గొర్రెలు, మేకలకు టీకాలు

మాచవరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని కొత్త గణేశునిపాడు గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం సోమవారం ఏర్పాటు చేసినట్లు పశు వైద్యాధికారి వి.రాము తెలిపారు. 250 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేసామన్నారు. 600 గొర్రెలకు, మేకలకు టీకాలు వేసామన్నారు. శిబిరంలో చూడు పరీక్షలు, నట్టల నివారణకు మందులు, గొర్రెల్లో బొబ్బ వ్యాధి నివారణకు మందులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ పల్లా నరేంద్ర, పశు వైద్య సహాయకులు, గ్రామ పెద్దలు నరసింహారావు, భిక్షమయ్య, సాంబయ్య, రమాదేవి పాల్గొన్నారు.